ACCION FRATERNA ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం మార్చి, 2009

FOR PRIVATE CIRCULATION ONLY

## సేంద్రీయ వ్యవసాయాభివృద్ధిలో మహిళలు కీలక భాగస్వాములు కావాలి !

మార్చి 8, అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మహిళా లోకానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సందర్భంగా మన బాధ్యతలు, కర్తవ్యాల్ని గుర్తు చేసుకోవడం సమంజసమని భావిస్తున్నాను.

మానవ నాగరికతలు వర్ధిల్లడంలోనూ, సంతతులు అభివృద్ధి చెందడంలోనూ మహిళలు చాలా కీలకమైన పాత్రను పోషించారు, పోషిస్తూ ఉన్నారు. మహిళలు ఆకాశంలో సగం అంటున్నారు. సంఖ్యరీత్యా మహిళలు సగమేకావచ్చు. కానీ సమాజం అభివృద్ధి చెందడంలో, కుటుంబ స్థాయిలో మహిళల పాత్ర, త్యాగాలు చాలా గొప్పవి. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు అన్ని రంగాలలో సమాన హక్కులు ఏర్పడాలని, స్త్రీలు తమ గురించి, తమ జీవితాల్ని గురించి స్వేచ్ఛగా ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకోగలిగిన హక్కులు ఉండాలని, ఇంటా, బయటా స్త్రీలపై జరిగే దోపిడీలు, వివక్షలు, అత్యాచారాలు అంతం కావాలని ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాము.

> మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రైతు మహిళలకు, స్వయం సహాయక గ్రూపులు, సస్యమిత్ర గ్రూపు రైతు మహిళలకు, మహిళా సిబ్బందికి నా శుభాకాంక్షలు.
>
> **డా॥ వై.వి.మల్లారెడ్డి**

### వ్యవసాయానికి ఆద్యులు మహిళలు

క్రీస్తు పుట్టడానికి కొన్ని వేల సంవత్సరాలకు పూర్వం నుంచే మన దేశంలో వ్యవసాయ నాగరికత అభివృద్ధి చెంది ఉన్నది. ఈనాడు అభివృద్ధి చెందిన దేశాలుగా చెప్పుకుంటున్న అమెరికా, ఇంగ్లాండులాంటి పశ్చిమ దేశాలకు వ్యవసాయం, పంటలు పండించడం తెలియక ముందే మన దేశంలో అభివృద్ధి చెందిన వ్యవసాయ నాగరికతల్ని చూసి ప్రపంచ యాత్రికులు ఆశ్చర్యం చెందారు. ఇక్కడ దొరికే పంట విత్తనాలను వారి దేశాలకు తీసుకువెళ్ళారు. దీనంతటికీ కారణం, మహిళలు సంతానం యొక్క ఆహారానికి బాధ్యత వహించడం. వారే స్వయంగా వ్యవసాయం చేయడం. ఆ కాలం నుండి కూడా పురుషులు వ్యవసాయంలో మహిళలకు సహకారాన్ని అందించేవారు. కుటుంబానికి, ఏ ఏ ఆహార పదార్థాలు పండించుకోవాలి ? ఏ విత్తనాలు భూమిలో నాటాలి అన్న విషయాలన్నీ మహిళలే చూసుకునేవారు. ఉపనిషత్తులలో అనేక చోట్ల మహిళల వ్యవసాయాన్ని గురించి ప్రస్తావనలు ఉన్నాయి. సంతానం పట్ల మహిళలకు సహజ సిద్ధంగా, ప్రకృతిపరంగా ఏర్పడే ప్రేమానురాగాలు వారిని ఆహారం పండించడం కోసం మంచి వ్యవసాయదారులుగా నిలబెట్టాయి. కాలక్రమేణా సమాజంలో మార్పులు రావడం, ఇంటా, బయటా పురుషుల సమాజంగానే సమాజం నడవడంలాంటి మార్పులు సంభవించాయి. దీని కారణంగానే వ్యవసాయంలో మహిళలు నిర్ణయాత్మక పాత్ర నుంచి వైదొలిగారు. మహిళలకు, వ్యవసాయానికి ప్రకృతిరీత్యా అవినాభావ సంబంధం ఉంది. మహిళలు ప్రధాన పాత్ర వహిస్తున్నంత కాలం వ్యవసాయంలో వ్యాపార ధోరణులు ప్రవేశించలేదు. ప్రకృతిని కొల్లగొట్టే ధోరణులు ప్రబలలేదు. కుటుంబం సుభిక్షంగా ఉన్నప్పుడే సమాజం కూడా సుభిక్షంగా ఉంటుంది. తమకు, తమ సంతానానికి ఆహార భద్రత కోసం మహిళలు వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. వ్యవసాయంలో ఏ మేరకు మహిళల ప్రాధాన్యత తగ్గుతూ వచ్చిందో, ఆ మేరకు వ్యవసాయంలో వ్యాపార ధోరణులు పెరుగుతూ వచ్చాయి. చివరికి ప్రకృతిని, వ్యవసాయాన్ని నాశనం చేసే రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగు మందులు వ్యాప్తిలోనికి వచ్చాయి. ఇప్పటికీ ఏరువాక కాలంలోనూ, పంటమార్పిడి కల్లాల్లోనూ, విత్తనాలు ఎంపిక చేసే ప్రక్రియల్లోనూ, విత్తనాలను రాబోయే పంటకాలానికి దాచి ఉంచే విధానంలోనూ మహిళల ఆచరించే సంప్రదాయాలు వారి ప్రాధాన్యతలను తెలియజేస్తాయి.

### సేంద్రీయ వ్యవసాయం అభివృద్ధి చెందడానికి మహిళల పాత్ర పెరగాలి.

ప్రస్తుతం మనమందరం నష్టాల ఊబిలో కూరుకుపోతున్న వ్యవసాయాన్ని తిరిగి పట్టాల మీదికి ఎక్కించాలని ప్రయత్నాలు చేస్తున్నాము. అందుకు మొదటి మెట్టుగా పురాతన సేంద్రీయ వ్యవసాయ విధానాలను తిరిగి ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాము. వ్యవసాయంలో మహిళల ప్రాధాన్యత పెరగాలని చెప్పడం కేవలం మహిళల పట్ల సానుభూతితోనో, లేదా వారిని గౌరవించడం కోసమనో చెప్పడం లేదు. వ్యవసాయం ప్రకృతికి అనుకూలంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ఇపుడు చేస్తున్న వ్యవసాయమంతా ప్రకృతికి వ్యతిరేకమైనది. వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యం ఏ మేరకు పెరుగుతూ ఉంటుందో, ఆ మేరకు వ్యవసాయం ప్రకృతికి అనుకూలంగా మారుతూ ఉంటుంది. వ్యవసాయమంటే లాభాపేక్ష కలిగిన వ్యాపారం కాదు. ఉత్తమ పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడడానికి, ప్రకృతి అనుకూల ఉత్పత్తులతో భవిష్యత్ తరాన్ని పెంపొందించడానికి →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

ఉపయోగపడే సమాజ జీవ ధాతువే వ్యవసాయం. అందుకే ప్రాణాలు నిలిపే వైద్యానిది సమాజంలో రెండవ స్థానం కాగా, ఆహారం ద్వారా మనుషులకు కావలసిన జీవధాతువును ఉత్పత్తి చేసే రైతుది మొదటి స్థానం.

## సంస్థాపరంగా మహిళలకు కల్పిస్తున్న ప్రాధాన్యతలు

ఎకాలజీ సంస్థ పనిచేస్తున్న అన్ని గ్రామాలలోనూ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను గురించి రైతులకు తెలియజేయడం జరుగుతోంది. వ్యవసాయంలో మహిళల ప్రాముఖ్యతను గుర్తించి, మహిళల భాగస్వామ్యం పెరగడానికి అనేక విధాలుగా సంస్థ ప్రయత్నిస్తుంది. దాదాపు 235 గ్రామాలలో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలకు సంబంధించిన విత్తనాలు రైతులకు అందజేసినపుడు మహిళా రైతులే మొట్టమొదట స్పందించారు. హర్షం వ్యక్తం చేశారు. వారికి తెలియకుండానే ఆహార భద్రతను కాపాడుతూ, ప్రకృతి పంటల వైవిధ్యాన్ని కాపాడుకునే సహజ సిద్ధమైన అంతర్లీన శక్తి వారిలో ఉండడం దీనికి నిదర్శనం. అంతేకాదు, రసాయనిక క్రిమి సంహారక మందుల స్థానంలో ప్రకృతి అనుకూల కషాయాలు తయారు చేసుకోవడం, జీవామృతాన్ని తయారు చేయడంలో మహిళలు చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చాలా చోట్ల కషాయాల తయారీలో మహిళలే ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. ఎరువుల అంగళ్ళకు వెళ్ళాల్సిన అవసరం లేదని శాసిస్తున్నారు. ధర్మవరం మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో పూర్తిగా మహిళలతోనే సస్యరక్షణ గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. కషాయాలు తయారు చేసుకుంటున్నారు. పైర్లకు పురుగు సోకితే దానిని గురించి చర్చించుకుంటున్నారు. పూర్తిగా రసాయన రహిత గ్రామంగా అభివృద్ధి చేశారు. ఈ ఘనత అంతా మహిళలతే అనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఈ అనుభవాలతోనే ప్రతి గ్రామంలోనూ 25 నుండి 30 మంది దాకా రైతులతో సస్యమిత్ర గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి గ్రూపులోను మహిళలు పురుషులు సమాన స్థాయిలో ఉంటారు. ప్రతి గ్రూపుకు మహిళ కన్వీనర్‌గానో, కో-కన్వీనర్‌గానో ఉంటారు. ఇలా సంస్థ పనిచేస్తున్న 235 గ్రామాలలో ఒక్కొ గ్రామంలో 5 నుండి 7 దాకా గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ స్థాయిలోని అన్ని సస్యమిత్ర గ్రూపుల కన్వీనర్లు, కో-కన్వీనర్లతో మండల స్థాయిలో ఒక సమాఖ్య ఏర్పాటు చేయడం జరిగింది. వీటిలో కూడా మహిళ కన్వీనర్‌గానో, కో-కన్వీనర్‌గానో తప్పనిసరిగా ఉంటారు.

సమాఖ్య అవసరాన్నిబట్టి 5 లేక 7 మంది వరకూ సభ్యులుంటారు. వీరిలోని ఒక మహిళా సభ్యురాలితోనూ ఎకాలజీ సెంటరు సిబ్బంది ఒకరితోను కలిసి బ్యాంకులో జాయింట్ అకౌంటు ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో ఇచ్చిన విత్తనాల ఖరీదు వసూలు అయిన దానితోనూ, అదనంగా సంస్థ నుంచి ప్రతి గ్రామానికి 15 వేల రూపాయలు ఈ ఖాతాలో జమ చేస్తారు. పంట కాలానికి ముందే ఏ రైతుకు ఏ రకం విత్తనం ఎంత కావాలి ? ఏ ఏ ఆహార పంటలు, పప్పు ధాన్యాల పంటలు వేయాలన్నది ఈ సభ్యులు నిర్ణయిస్తారు. ప్రతి గ్రామంలోనూ విత్తన బ్యాంకుల నిర్వహణ జరుగుతున్నది. ఎక్కువ భాగం మహిళలే వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. చర్చల సందర్భంలోనూ, నిర్ణయాలు తీసుకునే సందర్భాలలోనూ మహిళలు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే వాతావరణం కల్పించబడింది. అన్ని గ్రూపులలోనూ, సంఘాలలోనూ మహిళలు చాలా చొరవగానూ, సమర్థవంతంగానూ పనిచేస్తున్నారు. పంట ఉత్పాదనలకు విలువను పెంచే కార్యక్రమాల గురించి కూడా ఆలోచనలు సాగుతున్నాయి. దీని ద్వారా పంటలు లేని కాలంలో ఒక మేరకు ఉపాధిని పొందే అవకాశాలు ఉంటాయి.

## మహిళలు శక్తివంతులుగా ఎదగాలి.

వ్యవసాయంలో మహిళలు కోల్పోయిన స్థానాన్ని తిరిగి వారికి దక్కే దిశగా సంస్థ చేస్తున్న ప్రయత్నాలకు మంచి స్పందన లభిస్తోంది. అదే సందర్భంలో పురుషులను దూరం పెట్టే విధానంలో కాకుండా సామాజిక అవసరాల రీత్యా, కుటుంబ సంక్షేమం దృష్ట్యా మహిళల ప్రాతినిథ్యం ఎంత ఉపయోగకరమో, వాటి ప్రయోజనాలేమిటో నచ్చచెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతు మహిళలు, రైతులు కలిసి సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్ని అభివృద్ధి చేయాల్సిందిగా చెప్పడం జరుగుతోంది. దీనికి రైతులు బాగా సహకరిస్తున్నారు. మహిళల పాత్రను వారు మనసారా ఆహ్వానిస్తున్నారు.

అయితే సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్ని నెలకొల్పడంలో, మహిళలకు ఉండాల్సిన ప్రాధాన్యతల కోసం కృషి చేస్తున్న మనకు ప్రోత్సాహకరమైన వాతావరణం ఏర్పడినా, దీనితోనే మన లక్ష్యాలు నెరవేరినట్లుకాదు. ఇంకా చాలా మంది రైతులు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులకు వెలుపలే ఉన్నారు. రైతు బాగుతో పాటు, రైతు కుటుంబంలోని మహిళలకు, పిల్లలకు తగినంత పౌష్టికాహారం కరువు కాలంలో కూడా లభించగలగడం మన ప్రధాన లక్ష్యం. రైతులు కేవలం డబ్బు కోసం పండించడం కాదు. వారి కుటుంబానికి, కుటుంబ వినియోగానికి అవసరమైన పౌష్టికాహారం కూడా పండించుకోవాలి. వారు పంట ఉత్పత్తులను ఉపయోగించుకోవాలి. కుటుంబ స్థాయిలో స్త్రీలకు పిల్లలకు తిండి పెట్టడంలోవున్న వివక్ష పూర్తిగాపోవాలి. కుటుంబంలోని అందరికీ తగినంత పౌష్టికాహారం లభించే సంస్కృతి, సాంప్రదాయాలను పటిష్టంగా నెలకొల్పాలి. సమాజానికి కావలసిన తిండి గింజలు పండించడం మాత్రమే రైతు బాధ్యత కాదు. ఆ రైతు సభ్యులు అందరూ సక్రమంగా పౌష్టికాహారం ఉపయోగించగలగాలి. అదే మన లక్ష్యం. ఈ లక్ష్యం నెరవేరడానికి ఏ ఒక్కరి కృషి మాత్రమే సరిపోదు. రైతు మహిళలు, రైతులు, సిబ్బంది కలిసి ఈ జిల్లా నుంచి రసాయనిక ఎరువులు పురుగు మందుల్ని పూర్తిగా పారదోలగలగాలి. పంటల వైవిధ్యాలు కాపాడుతూ గ్రామాల్లోని ప్రతి కుటుంబం పౌష్టికాహార వైవిధ్యతను పెంపొందించగలగాలి. ఈ ప్రక్రియలో మహిళల కార్య శూరత్వానికి, సమర్థతకు పురుషులు తమ వంతు సహకారాన్ని అందించగలగాలి.

మీ శ్రేయోభిలాషి,

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి సెంటరు**

## మీకు తెలుసా !

- రక్తం ఆగకుండా పోతూ ఉంటే, దానిమ్మ పూవులు మెత్తని పొడిగా చేసి అద్దితే వెంటనే ఆగిపోతుంది. దానిమ్మ రక్తాన్ని చిక్కబరుస్తుంది.
- దానిమ్మ పూలను ఎండబెట్టి మెత్తని పొడిగాచేసి ముక్కు నుండి రక్తం వారినపుడు, ప్రమాద వశాత్తూ గాయాలు తగిలి రక్తం స్రవిస్తూ ఉన్నప్పుడు ఈ పొడిని వేసి అదిమితే రక్తం కారడం ఆగిపోతుంది.
- దానిమ్మ పూలను ఎండబెట్టి కషాయం తయారు చేసుకుని సేవిస్తే విరోచనాలు తగ్గుముఖం పడతాయి.
- దానిమ్మ పూల కషాయం స్త్రీలలో తెల్లబట్ట వ్యాధి, సంతాన హీనత, బహిష్టులో అధిక రక్తస్రావం, పురుషుల మూత్రం నుండి ఇంద్రియం పోవడం వంటి సమస్యల నివారణలో తోడ్పడుతుంది.
- దానిమ్మ తొక్కలను నలుపుగా మారే వరకూ రోస్టు చేసి, వాటిని మెత్తగా పొడిగా చేసి దానికి సమపాళ్ళలో వేరుశనగ నూనెకానీ, నువ్వుల నూనెగానీ కలిపి రుద్దుకుంటే, శరీరం మీద వచ్చే దురదలు తగ్గుముఖం పడతాయి.
- ఎండిన దానిమ్మ తొక్కలకు కొద్దిగా మిరియాలు, ఉప్పు కలిపి మెత్తని పొడిగా చేసి పళ్ళు తోముకుంటున్నట్లయితే, చిగుళ్ళు గట్టి పడతాయి. చిగుళ్ళ నుండి రక్తం కారడం తగ్గుతుంది. పళ్ళు శుభ్రం అవుతాయి.
- చెమట ఎక్కువగా పోసి దురదలుగా ఉన్నప్పుడు దానిమ్మ గుజ్జును పైపూతగా రాస్తే దురదలు తగ్గుతాయి. దీనిని గజ్జి, తామర వంటి చర్మ వ్యాధులపై కూడా వాడవచ్చును.
- దానిమ్మ కాయలపై తొక్క రసం నోటితో పుక్కిలిస్తే, పైపూత నుండి వెంటనే ఉపశమనం కలుగుతుంది.
- దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, కంటికలక వచ్చినప్పుడు కనురెప్పలపై భాగంలో రాస్తే కంటికలక తగ్గుతుంది.
- చెమట అధికంగా పడుతూ ఉంటే, దానిమ్మ ఆకులను నీటిలో వేసి స్నానం చేస్తే చెమట పట్టడం తగ్గుతుంది.
- దానిమ్మ వేర్లమీద, చెట్టు మొదలుమీద ఉంటే తోటతో తయారు చేసిన కషాయాన్ని పెద్దలకు గరిటెడు, పిల్లలకు అందులో నాలుగవంతు ఇస్తే కడుపులో పురుగులు నశిస్తాయి.
- చేతులు బెణికినప్పుడు దానిమ్మ చెక్కతో గంధం తీసి పై పూతగారాస్తే వెంటనే ఉపశమనం కలుగుతుంది.

**చిట్కా : మలబద్ధకం, గ్యాస్ట్రబుల్, ఆకలిగా లేకపోవడం ఉంటే జీలకర నమిలిమింగండి.**

## ఆహార భద్రత

ఆహార భద్రత అన్నది ప్రపంచ వ్యాప్తంగా దారిద్ర్య నిర్మూలనకు జరుగుతున్న పోరాటంలో ప్రముఖ స్థానం ఆక్రమించింది. దారిద్ర్యంతో అలమటిస్తున్న వారు తగినంత తిండి కొనడానికి శక్తి లేక లేదా పండించుకోవడానికి కావలసిన వనరులు మరియు అనుకూల పరిస్థితులు లేకపోవడం జరుగుతోంది. మహిళలు రెండింతలుగా ఆహార భద్రతతో లేమి అనుభవిస్తున్నారు. పిల్లల్ని కని, పెంచడంలో మహిళలకు ప్రత్యేక పోషక ఆహారం కావాల్సి ఉంటుంది. దారిద్ర్యంలో ఉన్నవారి కుటుంబంలో దొరికే ఆహారంలో మహిళల వాటా చాలా తక్కువగా వుంటుంది అందుకు తోడు దారిద్ర్యంలో బతుకుతున్న మహిళలు కుటుంబ పోషణ ఇంటా బయటా కూడా అధికంగా శ్రమించాల్సి వస్తోంది. ఈ కుటుంబాలలో పిల్లలు కూడా పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు.

ఆకలి అన్నది మనిషి వ్యక్తిగత స్థాయికి చెందినదే అయినా, ఆహార భద్రత లేక పోవడమన్నది స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన అంశం. వాణిజ్య సంబంధాలు, దిగజారిపోతున్న పర్యావరణం, రాజకీయ అస్థిరత్వాలు లేదా యుద్ధాలు – ఇవన్నీ కూడా ప్రజలకు ఆహార లభ్యతలో వ్యతిరేక పాత్ర నిర్వహిస్తాయి.

**ఆహార భద్రత అంటే ఏమిటి ?**

**ఆహార భద్రత :** ప్రజలందరికీ అన్ని సమయాలలో ఉల్లాసంగా, ఆరోగ్యకరంగా జీవించడానికి వారికి నచ్చిన ఆహారాన్ని చాలినంత పౌష్టికాహారం భౌతికంగా, సాంఘికంగా ఆర్థికంగా నిలకడగా అందుబాటులో ఉంటే, ఆహార భద్రత వున్నట్లు భావించవచ్చు.

**ఆహార భద్రత లేమి లేదా ఆహార 'అభద్రత' :** ఆహార భద్రతలేమి సంభవించడం (లేక ఆహార అభ్రత) అంటే, ప్రజలకు భౌతికంగా తగినంత శుభ్రమైన పౌష్టికాహారం, ఎల్లవేళలా లభించకపోవడం, వారి సాంఘిక, ఆర్థిక వెనుకబాటు కారణం తగినంత పౌష్టికాహారం సంపాదించలేక పోవడం లేదా చాలినంత శుభ్రమైన పౌష్టికాహారం వినియోగించుకోలేని బలహీన స్థితిలో ఉండడం.

**కుటుంబ ఆహార భద్రత :** కుటుంబ ఆహార భద్రత అంటే, కుటుంబంలోని వ్యక్తులు కుటుంబ స్థాయిలో అందరికీ కుటుంబ ఆహార భద్రత భావనను ప్రధానాంశంగా అమలు పరుస్తూ అవసరమున్న వారిపట్ల దృష్టి కేంద్రీకరించడం. 1) చాలినంత శుభ్రమైన పౌష్టికాహారం కుటుంబ సభ్యులందరికీ అందుబాటులో ఎల్లప్పుడు ఉండడం. 2) అవసరమైనంత శుభ్రమైన పౌష్టికాహారం కుటుంబ సభ్యులందరూ వినియోగించుకోగలగడం. 3) సరి అయిన పద్ధతులలో ఆహార వినియోగం అనే మూడు ప్రధాన అంశాల మీద కుటుంబ ఆహార భద్రత ఇమిడి ఉంటుందని అర్థం చేసుకోవాలి. పై మూడు అంశాలలో ప్రతి అంశంలోనూ మహిళలు ప్రధాన పాత్ర పోషించగలగాలి.

**చాలినంత ఆహారం అందుబాటులో :** స్థానిక వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా లేదా దిగుమతి చేసుకోవడం ద్వారా చాలినంత పౌష్టికాహార పదార్థాలు కుటుంబాలకు అందుబాటులో ఉండాలి. మనలాంటి చాలా దేశాలలో, మహిళలు వ్యవసాయ ఉత్పాదనలో కీలక పాత్ర నిర్వహిస్తున్నారు.

**అవసరమైనంత ఆహార వినియోగం :** అన్ని కుటుంబాలలోనూ వారి వారి కుటుంబంలోని వ్యక్తులందరూ వారి ఆహార అవసరాలకు చాలినంత బలవర్ధకాహారం వినియోగించుకోగలిగిన పరిస్థితిలో ఉండాలి. దీనిని వారు స్వంతంగా పండించుకోవచ్చును లేదా వాటిని కొనగలిగినంత ఆర్థిక పరిస్థితులు అభివృద్ధి చెంది ఉండాలి. ఆహార పదార్థాలను చాలినంతగా కొనలేని కుటుంబాల ఆర్థిక పరిస్థితుల వల్లనూ, సాంఘిక దురాచారాల పాటింపువల్లనూ (ఉదా॥ అందరూ తిన్న తరువాత స్త్రీలు తినే ఆచారం) లేదా పై రెండు కారణాలవల్లనూ మహిళలు, ఆడపిల్లలు కుటుంబంలో తక్కువ ఆహారం తినగలుగుతున్నారు. కావలసినంత ఆహారము వారికి అందడము లేదు.

**సరి అయిన పద్ధతుల్లో ఆహార వినియోగం :** కేవలం ఆరోగ్యకరమైన శరీరం మాత్రమే భుజించిన ఆహారాన్ని సమర్థవంతంగా రోజువారి కార్యకలాపాలకు కావలసిన శక్తిగా మారుస్తుంది లేదా నిలువ ఉంచుతుంది. వివక్షకు గురయ్యే మహిళలు, పిల్లల అవసరాలపట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించవలసి ఉంది. కుటుంబంలో అందరికీ ఆహార పంపిణీ చేస్తూ పసిపిల్లల సంరక్షణకు బాధ్యతలు వహించే మహిళలకు ప్రత్యేక పౌష్టికాహారం అవసరం. ముఖ్యంగా గర్భవతిగానూ, బిడ్డలకు పాలిచ్చే దశలోనూ పౌష్టికాహార అవసరం ఎక్కువగా ఉంటుంది.

# సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో....

## అంతర పంటలతో పురుగుల నియంత్రణ

వివిధ పంటలను నిష్పత్తులలో ఒకే పొలంలో ఒకే సమయంలో మొక్కల మధ్యదూరాన్ని పాటించి సాగు చేసే విధానాలను అంతర పంటల సాగుగా వ్యవహరిస్తారు. అంతర పంటలు వివిధ రకాల కీటకాలకు అడ్డుగోడలు నిలుస్తాయి. వాటిని నిరోధించడం ద్వారా చీడపీడల ఉధృతిని అదుపులో ఉంచవచ్చును. దీని వలన పరోక్షంగా పంటలను నష్టపరిచే కీటకాల సాంద్రత తగ్గిపోతుంది. అంతర పంటల సాగువలన సాలెపురుగులు, తునీగలు, ట్రైకో గ్రామావంటి మిత్ర పురుగులు అభివృద్ధి చెందుతాయి.

ఒక పంట ఆశించే కీటకాలు రెండవ పంటకు అవరోధంగా ఏర్పడుతాయి. పంటలలో పరోక్షంగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. మనకు అనువైన అంతర పంటల నిష్పత్తి.

| | | | |
|---|---|---|---|
| జొన్న | + | కంది | 2:1 |
| మొక్కజొన్న | + | కంది | 1:1 |
| సజ్జ | + | కంది | 2:1 |
| రాగి | + | కంది | 8:2 |
| పెసర | + | కంది | 5:1 |
| వేరుశనగ | + | కంది | 15:1 |
| ప్రొద్దుతిరుగుడు | + | పెసర | 2:1 |
| సజ్జ | + | పెసర | 2:1 |
| ఆముదం | + | పెసర | 1:7 |

### అంతర పంటలు వలన లాభాలు :

- అంతర పంటల సాగు వలన కొన్ని పంటలపై ఆశించు కీటకాల సహజ వృద్ధికి ఆటంకం కలిగి పరోక్షంగా వాటి నాశనానికి దోహదపడతాయి. ఎక్కువగా పై వేరు వ్యవస్థ గల పంటలతో లోతుగా వేరు వ్యవస్థ పంటలను అంతర పంటలుగా సాగు చేసుకోవాలి.
- పొడవు మరియు పొట్టి మొక్కలను వరుసలలో నాటుటవలన లోపల ఉన్న పంటల చీడపీడలు పై నున్న పంటలపైకి తొందరగా వ్యాపించవు. ఉదాహరణకు సజ్జ, జొన్న వంటి మొక్కలను వేరుశనగలో అంతర పంటగా 2.5 నిష్పత్తిలో పెంచడం వలన తామర పురుగుల బెడద తగ్గుతుంది.
- ప్రస్తుత వాతావరణం పరిస్థితులలో కందిని వివిధ రకాల పంటలతో అంతర పంటగా సాగు చేయడం వలన ఎక్కువ ఉపయోగమున్నది. కందిలో ఎండు తెగులు నివారణకు జొన్న మిశ్రమ పంటగా పండించాలి. జొన్న వేర్ల ద్వారా విడుదలయ్యే కొన్ని రకాల రసాయనాలు తెగులును కలిగించే శిలీంద్రాల పెరుగుదలను అరికడతాయి.
- కంది, ప్రత్తి, మిరప వంటి పైర్లతో మొక్క జొన్న, జొన్న, అలసంద, సోయాబీన్సు అంతర పంటలుగా సాగు చేయడంవలన శనగ పచ్చ పురుగుల ఉధృతిని ప్రధాన పంటపై తగ్గించవచ్చును.
- కంది ఆముదం వంటి దీర్ఘకాలిక పంపటలు సాగు చేయునపుడు తక్కువ కాల పరిమితిగల మినుము లేదా పెసర రకాలు విత్తుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మినుములేదా పెసర తీసిన వెంటనే కందిలేదా ఆముదం పంటలలో అంతర కృషి చేసి నీరు పెడితే దిగుబడులు పెరుగుతుంది.
- మినుము లేదా పెసరను ఆముదంలో అంతర పంటగా సాగు చేసినపుడు 71:1 నిష్పత్తిలో వేయాలి. ఆముదాలను ప్రతి హెక్టారు విస్తీర్ణానికి అయిదు కిలోలు వాడాలి. మొక్కల మధ్య దూరం 45 నుండి 60 సెం.మీ. ఉండాలి. మినుము, పెసర కందితో అంతర పంటలుగా సాగు చేసినపుడు కంది ఒక సాలు మినుము పెసర అయిదు సాళ్ళుగాని, లేదా కంది రెండు సాళ్ళు, మినుము పెసర ఆరు సాళ్ళు రకాన్ని బట్టి వేసుకోవాలి.
- ఆముదం, కంది అంతర పంటలుగా సాగు చేసినపుడు దాసరి పురుగులు ఉధృతి తగ్గింది.
- ప్రత్తి మిరప, కంది పైర్లతో బాటు జొన్న, మొక్క జొన్న, అలసంద, సోయాబీన్సు, అంతర పంటలుగా సాగు చేసినపుడు శనగపచ్చ పురుగుల ఉధృతి ప్రధాన పంటలపై తగ్గించవచ్చును.
- ఉల్లి, క్యారెట్ మిశ్రమ పంటలుగా సాగు చేయడంవలన క్యారెట్ ఆకుల నుండి వచ్చు వాసనవలన ఉల్లిలో తామర పురుగుల బెడద తగ్గుతుంది.
- జొన్నలో అంతర పంటలుగా వెల్లుల్లి లేదా అలసంద సాగు చేసినపుడు కాండం తొలుచు పురుగులను అరికట్టవచ్చును.
- కందిలో జొన్న పంటను అంతర పంటగా సాగు చేయడం వలన కందిని ఆశించు వేరు కుళ్ళు తెగులు మరియు ఎండు తెగులను అరికట్ట వచ్చును.
- సజ్జను వేరుశనగతో అంతర పంటగా సాగు చేసినపుడు వేరుశనగలో కాయ తొలచు పురుగుల ఉధృతి మరియు సజ్జలో మొవ్వుకుళ్ళు తెగులు ఉధృతి తగ్గుతుంది.
- జొన్నలో మినుము లేదా పెసర అంతర పంటలుగా సాగు చేసినపుడు జొన్నలో మొవ్వు ఈగలు మరియు అపరాలలో కాయ తొలచుపురుగుల ఉధృతి తగ్గింది. వెల్లుల్లి పైర్లతో మిశ్రమ పంటలుగా సాగు చేస్తే గొంగళి పురుగుల ఉధృతి తగ్గుతుంది. క్యాబేజి, కాలిఫ్లవర్ వేయుటకు ముందుగా టమోటాగాని, మొక్కజొన్నగాని వేయడంవలన పురుగుల ఉధృతి తగ్గించవచ్చును.
- ఆవాలు క్యాబేజి అంతర పంటలుగా సాగు చేయడం వలన క్యాబేజి పంటపై ఆశించు పురుగుల ఉధృతి తగ్గించవచ్చును. ప్రతి 25 వరుసల క్యాబేజిలో రెండు వరసల ఆవాల పంటను వేసుకోవాలి.
- టమోటా, బెండ, వంగ, కాకర, బీన్సు, చిక్కుడు, బంగాళదుంప వంటి పైర్లలో నులిపురుగుల బెడద ఎక్కువగా వుంటుంది. బంతి, ఆవాలు, నువ్వులు వంటి పైర్లు మిశ్రమ పంటలుగా సాగు చేయడం వలన నులిపురుగుల బెడద తగ్గుతుంది.
- టమోటాలో అంతర పంటగా ప్రతి 3 వరుసలకు ఒక వరుస మొక్కజొన్న నాటుకోవాలి. లేదా టమోటా తోట గట్లపై ఎర పంటలుగా మొక్కజొన్న లేదా ఆముదం వేయవచ్చును. టమోటా పంటపై పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- కనకాంబరం వంటి పూత తోటలలో అంతర పంటగా బెండ, బీర, మునగ వంటి కూరగాయలుగాని అరటి, జామ, బొప్పాయి వంటి పండ్ల మొక్కలను అంతర పంటగా సాగు చేయడం వలన కనకాంబరం మొక్కలపై పురుగుల ఉధృతి తగ్గుతుంది.

(రైతువాణి, ఫిబ్రవరి 2009 సంచిక నుండి)

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in